పర్వదినాలు మతసామరస్యానికి ప్రతీక

కార్పొరేటర్ శ్రీవాణి



రామంతాపూర్ : గాంధీనగర్‌లోని ఉస్మాన్ బీన్ మసీదులో మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ఆదివారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమానికి కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. పర్వదినాలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు విటమిన్ ట్యాబ్లెట్లు



పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో మాజీ కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు విటమిన్ ట్యాబ్లెట్లను పంపిణీ చేశారు.

డ్రగ్స్ మాఫియాపై మరింత కఠినంగా వ్యవహరించాలి

మేడ్చల్: దేశవ్యాప్తంగా రెచ్చిపోతున్న డ్రగ్స్ మాఫియాపై మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశాడు. ఆదివారం డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా డ్రగ్స్ ఎక్కడ దొరికినా.. మూలాలు హైదరాబాద్‌లో ఉంటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాఫియాపై మరింత కఠినంగా వ్యవహరించి నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. అధికారులు ఉదాసీనత వైఖరి వీడి చర్లపల్లి ఘటనలు మరోసారి చోటుచేసుకోకుండా చూడాలన్నారు. నాయకులు జ్యోతి, అంజలి, నర్సింగ్‌రావు, రంజిత్‌రెడ్డి, గౌస్, చంద్రశేఖర్, అక్షయ, బాలు తదితరులున్నారు.

నిబంధనలు గాలికొదిలారు !

ప్రభుత్వ నిబంధనలు పాటించని మాంసం దుకాణదారులు

- అపరిశుభ్రంగా పరిసర ప్రాంతాలు, ప్రబలుతున్న అంటువ్యాధులు
- స్లాటర్ హౌజ్‌లపై చర్యలు తీసుకోని అధికారులు



అపరిశుభ్ర వాతావరణంలో కాలుస్తూ..

బోడుప్పల్: చెంగిచర్లలోని స్లాటర్ హౌజ్ బయట కొంతమంది మాంసం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మేకలు, గొర్రెలను రోడ్డుపైనే వధిస్తున్నారు. దీంతో చుట్టు పక్కల పరిసర ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు సంబంధిత శాఖ, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆరోగ్యంగా ఉంటేనే విక్రయం

మాంసం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎవరైనా గొర్రెలు, మేకలు కటింగ్ స్లాటర్ హౌజ్‌లో కట్ చేయించుకున్న తర్వాతే అమ్ముకోవాలి. తొలుత మేకలు, గొర్రెలను స్లాటర్‌హౌజ్‌లో ఉండే వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఆరోగ్యవంతంగా ఉంటేనే స్లాటర్ హౌజ్‌లో కటింగ్ చేయించుకున్న తర్వాత దానిపై అక్కడ అధికారులు ముద్ర వేస్తారు. ఇలా ముద్ర వేసిన తరువాతే దుకాణాల్లో విక్రయించాలి.

రోడ్డుపైనే 70కి పైగా అనధికారంగా దుకాణాలు

స్లాటర్ హౌజ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో 70కి పైగా మాంసం దుకాణాలు అనధికారంగా నిర్వహిస్తున్నారు. కొద్దిమంది స్లాటర్‌హౌజ్ లోపల వధించి బయట విక్రయిస్తుండగా.. మరి కొందరు దుకాణదారులు వారి దుకాణం వద్దే వధిస్తున్నారని, ఇలా చేయడం జంతువుల రక్తం రోడ్డుపైనే పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు..

చెంగిచర్ల చౌరస్తా నుంచి స్లాటర్ హౌజ్‌కు వెళ్లే రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా మాంసం దుకాణాలు నిర్వహిస్తున్నారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో మాంసాన్ని విక్రయిస్తున్నారు. వాటిపై ఈగలు, దోమలు వాలడం, గాలికి లేచిన దుమ్ము పడుతోంది. ఇలాంటి అపరిశుభ్ర ప్రాంతంలో విక్రయించే మాంసం తింటే అనారోగ్యాన్ని గురవుతారని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. వీరిపై సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

రూ.900 నుంచి రూ.1000

మార్కెట్‌లో మాంసం కిలో రూ.900 నుంచి రూ.1000 ఉండగా.. ఇక్కడ మాత్రం రూ. 400 నుంచి రూ.500 వరకు తక్కువ ధరకు అమ్ముతున్నామని చెబుతూ.. అనారోగ్యం, చనిపోయిన జంతువులను కట్‌చేసి మాంస ప్రియులకు విక్రయించి క్యాష్ చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి.



రోడ్డు పక్కనే జంతువుల వ్యర్థాలు

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



ఇక్కడ విక్రయించే మాంసం తింటే అనారోగ్యం పాలవుతాం. ఎలాంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నాసిరకం మాంసాన్ని అమ్ముతున్నారు. దీనికి తోడు అపరిశుభ్ర వాతావరణంలో విక్రయిస్తున్నారు. ఇక్కడ పరిసర ప్రాంతంలో శానిటేషన్ కూడా సరిగ్గా నిర్వహించడం లేదు. ఇలాంటి వారిపై సంబంధితశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– ఏర్పుల మహేష్, ఇందిరానగర్ కాలనీ

మరో ప్రాంతానికి తరలించాలి

జనవాసాలకు దగ్గరలో ఉన్న స్లాటర్ హౌజ్‌ను వేరే చోటుకి తరలించాలి. ఈ స్లాటర్ హౌజ్ వల్ల చెంగిచర్లలోని పరిసర ప్రాంతాలు, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఆదివారం రోజు రోడ్డుపై ఇష్టానుసారంగా జంతువులను వధిస్తుండటంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. పబ్లిక్ టాయిలెట్ల పక్కనే మాంసాన్ని విక్రయిస్తున్నారు.

– శ్రీనివాస్, చెంగిచర్ల

ఆలయాల మూసివేత



రామంతాపూర్ : చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి నేడు ఉదయం 5 గంటల వరకు రామంతాపూర్‌లోని ప్రభుత్వ దేవాదాయశాఖ ఆధీనంలోని మల్లికార్జున స్వామి దేవాలయం, రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయం, కోదండ రామలింగేశ్వర ఆలయంతో పాటు కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, మహంకాళి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలను మూసివేశారు. అన్ని దర్శనాలు ఆర్జిత సేవలను రద్దు చేశారు.

దివ్యాంగులకిచ్చిన హామీని అమలు చేయాలి

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్‌ను ఇస్తామని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల జేఏసీ వ్యవస్థాపకులు, సలహాదారులు నల్లా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నాచారం బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో నాచారం డివిజన్ దివ్యాంగుల జేఏసీ ఆవిర్భావ సభను నిర్వహించారు. సంస్థ నాయకులు బూడిద గణేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా నల్లారాధాకృష్ణ హాజరై మాట్లాడారు. ఆసరా పెన్షన్ల పెంపునకు మందకృష్ణ మాదిగ అక్టోబర్‌లో వికలాంగుల గర్జన సభకు పూర్తి మద్దతూ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికి మద్దతుగా అక్టోబర్‌లో రెండో వారంలో దివ్యాంగులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, సాయిబాబా, ప్రమోద్‌కుమార్ మహారాజ్, గద్ద యుగేంధర్, విద్దయ్య, నరేంద్రమోహన్, శ్రీనివాస్, రమేష్, దుర్గయ్య, కృష్ణ, ఫిరోజ్, వినోద్, గౌస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

బోడుప్పల్: బహుజనులు రాజ్యాధికారం సాధించాలని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. ఆదివారం బోడుప్పల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి 342 జ్ఞానమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 78 ఏళ్ల స్వాతంత్ర్యంలో బడుగు, బలహీనవర్గాల ప్రజలు వెనకబడి ఉన్నారన్నారు. రాజ్యాధికారం సాధించుకుని అన్ని రంగాల్లో ముందుండేందుకు కృషి చేయాలన్నారు. భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, యాకయ్య, సాయి, గడ్డం రాజు, గల్ల పరమేష్ తదితరులున్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

కాలనీ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని అభినందిస్తున్న రవిగౌడ్

బోడుప్పల్: చెంగిచర్ల 2వ డివిజన్ పరిధిలోని శ్రీలక్ష్మీనగర్ కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోలకట్ల సందీప్, ఉపాధ్యక్షుడిగా సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నర్సింహాచారి, కోశాధికారిగా జోగు రాజు, సంయుక్త కార్యదర్శిగా కమలాకర్‌రెడ్డి, సలహాదారులుగా శ్రవణ్‌కుమార్, చందు, సభ్యులుగా సహదేవ్, మనోజ్, ప్రవీణ్‌యాదవ్, శ్రీనివాస్, వెంకటయ్య, గణేష్, కనకయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. చెంగిచర్ల మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్ నూతన కమిటీని అభినందించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మల్లాపూర్: బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. ఆదివారం మల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శైలేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రాంచందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి యాదగిరిచారి, ముత్యంరెడ్డి, నిర్మల డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, తునికి గణేష్, రామయ్య, తిరుపతిరెడ్డి, కోశాధికారి శివకుమార్, కార్యదర్శులు రమేష్, శత్రు తదితరులు పాల్గొన్నారు.



రాంచందర్‌రావును సత్కరిస్తున్న స్థానిక బీజేపీ నేతలు

పౌర సేవల్లో జాప్యం !

సిబ్బంది కొరత.. నామమాత్రంగా వార్డు ఆఫీసర్లు

- పరిశీలనకే పరిమితమైన ధ్రువీకరణ పత్రాలు
- మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 34 పురపాలికలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: పురపాలిక సంఘాల్లో సిబ్బంది కొరతతో పురసేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించినప్పటికీ, 'ఎక్కడ వేసిన గొంగడి.. అక్కడే' అన్న చందంగా ఉంది. ఫలితంగా సిటిజన్ చార్టు అమలునకు నోచుకోవటం లేదనే విమర్శలను ఎదుర్కొంటోంది. కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే పుర వ్యవహారం నడుస్తుండటంతో వార్డు అధికారుల పాత్ర నామమాత్రమవుతోందనే ఆరోపణలున్నాయి.

అదనపు భారం పడకుండా..

పురపాలికల్లో ఆదాయ వనరులను పెంచేందుకు తగిన వ్యూహంతో ముందుకుసాగాల్సిన అధికార యంత్రాంగం లేఅవుట్లు, ఇళ్లు, బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అనుమతులకు దొడ్డి దారిన సంపాదించే అక్రమార్జనపై చూపినంత శ్రద్ధను పలువురు పుర అధికారులు.. ప్రభుత్వానికి సమకూర్చాల్సిన ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించటం లేదని విమర్శలు ఎదురవుతున్నాయి.

- పురపాలక సంఘాల్లో వార్డు అధికారులకు ఇటీవల ఉన్నతాధికారులు అప్పగించిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల పరిశీలన బాధ్యతలను చూడాల్సి ఉన్నప్పటికీ.. ఆయా కమిషనర్ల చర్యలకు అనుగుణంగా విధులను నిర్వహించాల్సి వస్తోంది. దీంతో వార్డు అధికారులు తమకు అప్పగించిన పనులను నామమాత్రంగా మాత్రమే చేపడుతున్నట్లు తెలుస్తోంది.
- మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 34 పురపాలికల్లో వార్డు అధికారుల ప్రమేయం కొంతమేరే ఉంటోంది. వార్డు అధికారులు అన్ని పనుల్లో కీలకపాత్ర పోషించాల్సి ఉన్నప్పటికీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లో విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు.

పత్రాల జారీలోనూ జాప్యమే..

పురపాలక సంఘాల నుంచి ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. సంబంధిత పత్రాలు సకాలంలో జారీ కాకపోవడంతో ఆఫీసుల్లో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో సంబంధిత కార్యాలయాల చుట్టూ.. ప్రజలు తిరగాల్సి వస్తోంది. సాధారణంగా నగరాలు/ పట్టణాల్లో ఇటీవల జనన, మరణ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. దీనికితోడు పురపాలికల్లో కొనసాగుతున్న ప్రత్యేక పాలన నేపథ్యంలో ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొనడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

అనుమతులకు పడరాని పాట్లు..

ఇంటి నెంబర్లు, మ్యూటేషన్లు నల్లా అనుమతులు పొందడానికి కూడా స్థానిక ప్రజలు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఎంతో కొంత సమర్పించుకుంటేనే గానీ పనులు ముందుకుసాగడం లేదని, లేనిపక్షంలో సరైన పత్రాలు లేవన్న కారణాలతో కొర్రీలు పెడుతూ.. మరింత జాప్యం చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

ఇంటినెంబర్లలో కూడా..

పురపాలక సంఘాల్లో అన్ని అనుమతులతో ఇళ్ల నిర్మించుకున్న వారికి ఇంటినెంబర్లు కేటాయించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు ఆయా పట్టణాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఇంటి నంబరు సకాలంలో కేటాయించని పలువురు పుర అధికారులు ఏళ్ల తరబడి భవనాలు నిర్మించుకుని విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, ఓయో పేరుతో చర్యలకు పాల్పడుతున్న వారిపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శిస్తున్నారు.

ఏళ్లతరబడి వదిలేసిన వైనం..

పురపాలక సంఘాల్లో ఏళ్ల తరబడి ఇళ్లు ,బహుళ అంతస్తులు నిర్మించుకుని, ఇంటి నెంబర్లు పొందకుండానే విద్యాసంస్థలు, వివిధ రకాల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నప్పటికీ పుర కమిషనర్లు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. కొత్త ట్రేడ్ లైసెన్సు జారీ, రెన్యూవల్ విషయాల్లో కూడా పుర అధికారుల ఉదాసీనత, ఆదాయ వనరుల పెంపునకు విఘాతం కలిగిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. వీటిపై ఆయా జిల్లాల అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ముగిసిన గణనాథుడి నిమజ్జనం

ఉప్పల్ బేబీ పాండ్‌లో దాదాపు 5050 విగ్రహాలు..



ఉప్పల్ బేబీపాండ్‌లో..



స్వాగత వేదికపై మాట్లాడుతున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు

మల్కాజిగిరి: సర్కిల్ పరిధిలోని సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్, బండ చెరువు కొలను వద్ద నిమజ్జనం ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌లు విగ్రహాలకు స్వాగతం పలికారు.

వ్యర్థాల తొలగింపు..

సఫిల్‌గూడ ట్యాంక్‌బండ్‌లో మూడడుగుల కంటే ఎత్తుగా ఉన్న విగ్రహాలు 1172, బండచెరువు కొలను వద్ద 1078 విగ్రహాలు నిమజ్జనానికి వచ్చాయని అధికారులు వివరించారు.

లడ్డూ వేలం..

మల్లాపూర్: నాచారం రాఘవేంద్రనగర్‌లో భజరంగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లడ్డూను కాలనీకి చెందిన ప్రశాంత్ రూ.1,0,8000లకు దక్కించుకున్నారు.

బోడుప్పల్: రాజీవ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లోని వినాయకమండపం లడ్డూను పల్లె వెంకటరమణ, అనిత దంపతులు రూ. 41వేలకు దక్కించుకున్నారు. మాజీ కార్పొరేటర్ దానగల్ల అనితాయాదగిరి దంపతులు, నేతలు గోపురాము, నానాజీ, స్వామి, రమేష్, నాగరాజు తదితరులున్నారు.

- చెంగిచర్ల ఎంఎల్ఆర్ కాలనీ, అక్షయకాలనీ కమిటీ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద లడ్డూను వేలం వేయగా.. పిల్లి అనూష, శ్రీకాంత్‌పటేల్ దంపతులు రూ.4.86లక్షలకు దక్కించుకున్నారు. ఎంఎల్ఆర్ కాలనీ వీధి నెంబరు– 2లోని వినాయకుడి హుండీని రజితాశ్రీనివాస్‌రెడ్డి రూ.52వేలు, పట్టు వస్త్రాన్ని కేతిరెడ్డి స్వర్ణలత, శోధర్‌రెడ్డి రూ.38 వేలకు దక్కించుకున్నారు. నేతలు కొత్త రవిగౌడ్, విక్రమ్‌గౌడ్, ఏర్పుల మహేష్, కల్యాణ్ కుమార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉప్పల్: ఆదర్శనగర్ అపురూప జగపతి హైట్స్‌లో నిర్వహించిన లడ్డూ వేలంలో పవన్ అండ్ గ్రూప్ రూ.1,30,500లకు లడ్డూను దక్కించుకున్నారు.

ఉప్పల్: సర్కిల్ పరిధిలో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ముందుగానే పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పండుగకు ముందే పోలీసులు అధికారులు అప్రమత్తమై కాలనీ అసోసియేషన్లు, మండప నిర్వాహకులతో పాటు ఉత్సవ సమితి సభ్యులతో కలిసి ముందస్తుగానే అవగాహన కార్యక్రమాలు చేశారు. అన్ని విభాగాల అధికారుల కృషితోనే నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఉప్పల్ నల్ల చెరువు వద్ద ఉన్న బేబీపాండ్‌లో 11 రోజుల్లో దాదాపుగా 5050 వరకు విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు ప్రకటించారు.

- దేవేందర్‌నగర్‌లో తాత్కాలిక బేబీపాండ్‌లో దాదాపుగా 275 వరకు విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు వివరించారు.



స్వాగతవేదికపై పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



రాజీవ్‌నగర్ లడ్డూను దక్కించుకున్న పల్లె వెంకటరమణ దంపతులు



లడ్డూతో అనూషాశ్రీకాంత్ పటేల్ దంపతులు

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నవోదయనగర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో పెద్ద మొత్తంలో డ్రగ్స్ తయారీ ఘటనపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నవోదయ నగర్‌లోని షెడ్డు వద్ద నిరసన చేపట్టారు. ఇది ముమ్మాటికి పోలీసు నిఘా వైఫల్యమేనని ఆరోపించారు. ప్రభుత్వం దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, కోమటి రవి, శ్రీనివాసులు, లక్ష్మణ్, వరప్రసాద్, జగ్గరాజు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, శరత్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన 'ఈశా గ్రామోత్సవం' క్రీడా పోటీలు



వాలీబాల్ క్రీడాకారులతో ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య

మల్లాపూర్: 17వ ఈశా గ్రామోత్సవం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రారంభమయ్యాయి. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. వాలీబాల్, గుస్సాడీ, చిరుతల రూపకం గిరిజన జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కనుమరుగవుతున్నా.. క్రీడలను తెలంగాణలోని అన్ని జిల్లాలోని గ్రామస్థాయిలో క్రీడాపోటీలను పెట్టి ఆటగాళ్లను ప్రోత్సహిస్తున్న 'ఈశా గ్రామోత్సవం' టీమ్ అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడలో గెలుపొందిన వారికి 21న ఈశా యోగా సెంటర్‌లో జరిగే ఫైనల్స్‌లో పాల్గొని, గెలుపొందిన వారికి నగదు బహుమతులను కోయంబత్తూర్‌లోని ఆదియోగిచేత అందజేస్తారన్నారు.

'బహుజన బతుకమ్మ' పోస్టర్ ఆవిష్కరణ

మల్లాపూర్: ప్రకృతి రక్షణే ప్రజల రక్షణగా చేపట్టబోయే 'బహుజన బతుకమ్మ' వాల్‌పోస్టర్‌ను ఆదివారం మల్లాపూర్ అంబేడ్కర్‌నగర్ విగ్రహం వద్ద బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈనెల 29న మల్లాపూర్ గోకుల్‌నగర్‌లో బహుజన బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి విమలక్క హాజరుకానున్నట్లు సమాచారం. బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ప్రతినిధులు వెంకటయ్య, మల్లేష్, యాకన్న, మురళి పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376
9912225470
9912220571